నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 8 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

గూడేలను టైగర్‌జోన్‌గా ప్రకటిస్తే ఊరుకోం

సమావేశంలో నాయకులు

ఆసిఫాబాద్ టౌన్,నవంబర్ 7 : గూడేలను టైగర్ జోన్‌గా ప్రకటిస్తే ఊరుకోబోమని ఆదివాసీ నాయకులు సర్కారును హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాయి సెంటర్‌లో రాజ్‌గోండ్ సేవా సమితి, రాయి సెంటర్ పెద్దలతో ఆదివాసీ నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్‌లో 65 బ్లాకులు, కాగజ్‌నగర్ డివిజన్‌లో 48 బ్లాకులను టైగర్ జోన్‌గా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పునరాలోచించి అదనపు టైగర్‌జోన్ ఏర్పాటును విరమించుకోవాలని, లేని పక్షంలో కుమ్రం భీం స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పేందూరు సుధాకర్, నాయకులు ఆత్రం భీమ్ రావు, ఆత్రం చందన్ షాషా, కొర్కెట జ్ఞానేశ్వర్, సిడం అర్జున్ పాల్గొన్నారు.

'ఎంసీహెచ్' రోగులకు 'ఎక్స్‌రే' తిప్పలు

ఎంసీహెచ్ నుంచి జీజీహెచ్‌కు ప్రత్యేక వాహనంలో వెళ్తున్న రోగులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 7 : జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డులో గల మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వస్తున్న గర్భిణులు, బాలింతలు, శిశువులకు 'ఎక్స్‌రే' కష్టాలు తప్పడం లేదు. కొన్ని రోజులుగా ఎంసీహెచ్‌లోని ఎక్స్‌రే పరికరం పని చేయకపోవడంతో ఇక్కడికి వచ్చిన రోగులను ఐబీ చౌరస్తాలోగల జిల్లా జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)కు ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో తరలిస్తున్నారు. అక్కడ ఎక్స్‌రే తీయించుకొని తిరిగి ఎంసీహెచ్‌కు చేరుకుంటున్నారు. ఇలా నిత్యం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని, ఇకనైనా సిబ్బంది స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని రోగులు కోరుతున్నారు.

కార్యాలయం ముఖ ద్వారం వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బంది

మొదటి అంతస్తుకు వెళ్లే దారిలో పోలీసుల భద్రత

మావోయిస్టుల లేఖ.. ఎమ్మెల్యేకు భద్రత పెంపు

● బెల్లంపల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద విస్తృత తనిఖీలు ● సామాన్యులు ఎమ్మెల్యేను కలవడం కష్టమే..!

బెల్లంపల్లి, నవంబర్ 7 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీరు మార్చుకోవాలని హెచ్చరిస్తూ మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఇటీవల లేఖ విడుదల చేసిన నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఆయనకు మరింత భద్రత పెంచింది. గురువారం నియోజకర్గంలో ఎమ్మెల్యే పర్యటించగా, క్యాంపు కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్యాలయ ముఖ ద్వారం వద్ద బాంబ్ స్క్వాడ్ తనిఖీలు ('డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్) చేపడుతున్నారు. ఇంతకు ముందు ఆయనకు 2ప్లస్2 భద్రత ఉండగా, ప్రస్తుతం 3ప్లస్3కి పెంచారు. కమిషనరేట్ పరిధి నుంచి మరో ఇద్దరు సిబ్బంది భద్రత చూస్తున్నారు. కాన్వాయ్‌లో సంబంధిత పోలీస్‌స్టేషన్ వాహనం ఉండగా, ప్రస్తుతం సీఐ వాహనంతో అదనపు బందోబస్తు నిర్వర్తిస్తున్నారు.

సామాన్యుడు ఎమ్మెల్యేను కలవడమెలా..?

ఇప్పటికే నెలలో కొన్నిసార్లే నియోజకవర్గానికి వచ్చి వెళ్తున్న ఎమ్మెల్యే వినోద్‌ను ఇక సామాన్యులు కలవడం కష్టమయ్యేలా ఉంది. ఆయనను కలిసేందుకు ఎప్పుడు వెళ్లినా చుట్టూ ఉండే చోటా..మోటా నాయకుల వల్ల దర్శన భాగ్యం లభించలేదని పలువురు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ హెచ్చరిక లేఖతో ఆయనకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. క్యాంపు కార్యాలయం ముఖ ద్వారం, మొదటి అంతస్తుకు వెళ్లే దారిలో పోలీసుల బందోబస్తు ఉంటుంది. దీంతో ఇక సామాన్యులు ఆయనను కలిసే అవకాశం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే.. ముందు క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే వస్తున్నారని తెలుసుకున్న కొంతమంది కార్యకర్తలు, ప్రజలు ముందుగానే కార్యాలయానికి వచ్చారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే మొదటి అంతస్తులో ఉన్న ఆయన గదికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. అరగంట తర్వాత నేరుగా కిందికి వచ్చి వాహనంలో తాండూర్‌కు వెళ్లారు. అప్పటి వరకు వేచి ఉన్న కార్యకర్తలు, ప్రజలు నిరాశతో ఇంటి ముఖం పట్టారు.

పల్లెల్లో పత్తి దళారుల దోపిడీ

● సీసీఐ సేకరణ ప్రారంభించకపోవడంతో వ్యాపారులకు కలిసి వస్తున్నవైనం
● క్వింటాలుకు రూ. వేయి నుంచి రూ. 1500 దాకా నష్టపోతున్న రైతులు
● పట్టించుకోని అధికారులు

ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు తెరిచి కొనుగోళ్లు

ఆసిఫాబాద్ సమీపంలో హైవే పక్కన దుకాణం పెట్టి పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారి

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు కలిసి వస్తున్నది. పల్లెల సమీపంలో.. హైవే రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ కాంటాలు పెట్టి కొనుగోళ్లు చేపడుతూ రైతులను నిలువుదోపిడీ చేయడం ఆందోళన కలిగిస్తున్నది.

జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో సాగు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు తెలుస్తుండగా, 23 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని యంత్రాంగం భావిస్తున్నది. ఇప్పటికే జిల్లాలో పత్తి ఏరడం మొదలైంది. పంట చేతికొస్తుండగా, సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తున్నది.

రైతులకు తీవ్ర నష్టం

జిల్లాలో ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్‌నగర్‌లో మార్కెట్ యార్డులు ఉన్నాయి. యేటా ఈ సమయానికల్లా పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కానీ ఈ యేడాది ఇప్పటికీ సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు పత్తి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 7521 ధర నిర్ణయించగా, దళారులు మాత్రం రూ. 6 వేల నుంచి రూ. 6500 వరకే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు రూ. వెయ్యి నుంచి రూ. 1500 వరకు నష్టపోతున్నారు. దళారుల ప్రమేయం అధికంగా ఉండే ఆసిఫాబాద్ జిల్లాలో రైతులకు అవగాహన కల్పించి మార్కెట్ యార్డులోనే పత్తి విక్రయించేలా ప్రోత్సహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇటు ఈ ఏడాది అధిక వర్షాల వల్ల దిగుబడులు రాక.. అటు చేతికొచ్చిన పంటకు మద్దతు ధర లభించక కర్షకులు తలలు పట్టుకుంటున్నారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని వేడుకుంటున్నారు.

పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కేయూపీ అగ్రిటెక్ జిన్నింగ్‌లో కొనుగోళ్లు ప్రారంభిస్తాం. సీసీఐ నిబంధనలను అనుసరించి విడుతల వారీగా మిగతా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. రైతులెవరూ ప్రైవేట్ వ్యాపారులకు పత్తి ఆశ్రయించవద్దు. నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోని పత్తి అమ్మాలి. నిబంధల ప్రకారం నాణ్యతతో పత్తిని తీసుకురావాలి.

- అశ్వక్ హైమద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

సీతాకోక చిలుకలు, పక్షులపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దండేపల్లి, నవంబర్ 7 : తాళ్లపేట రేంజ్ పరిధిలోని గోండుగూడ అటవీ ప్రాంతంలో గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అటవీశాఖ అధికారులు సీతాకోకచిలుకలు, పక్షుల గురించి క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించి, అవగాహన కల్పించారు. సీతాకోక ఏ చెట్టుపై వాలుతుంది, ఏ పూవులోని మకరందాన్ని స్వీకరిస్తుంది..? గతంలో ఉన్న సీతాకోక చిలుకలు ప్రస్తుతం ఉన్నాయా..? వాటి ఆవాసం..అనుకూలత తదితర విషయాల గురించి విద్యార్థులకు వివరించారు. గడ్డి భూములు, పక్షులు, వన్యప్రాణుల ఆవాసాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సాగరిక, ఎఫ్‌బీవోలు రహీముద్దీన్, లాల్‌భాయి, తన్వీర్, పీడీ రోజీ వరకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఇంటర్నెట్ సేవలు విస్తరించాలి

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 7 : జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలు విస్తరించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి బీఎస్ఎన్ఎల్, టీ-ఫైబర్, పంచాయతీరాజ్, రోడ్డు భవనాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి, సివిల్ సప్లై అధికారులతో మొబైల్ ఇంటర్నెట్ సేవల విస్తరణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ అందించే అనేక రకాల సేవలు ఇంటర్నెట్ సౌకర్యంపై ఆధారపడి ఉన్నాయన్నారు. టవర్ల ఏర్పాటు కోసం అటవీశాఖ అనుమతితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ తీర్మానాలు, ఆర్వోఎఫ్ఆర్ అనుమతులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని తిర్యాణి, బెజ్జూర్, దహెగాం, లింగాపూర్ మండలాల్లో కొన్ని టవర్ల నిర్మాణం పూర్తయిందని, వాటికి వెంటనే కనెక్షన్లు అందించాలని ఆదేశించారు.

నాణ్యమైన విద్యనందించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, నవంబర్ 7 : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు రుచికరమైన భోజనం పెట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కన్నెపల్లి మండలంలోని ప్రాథమిక, కస్తూర్బా పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయానికి వస్తున్నారా, మంచి భోజనం, విద్య అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. తల్లిదండ్రులు తీసుకువచ్చే తినుబండారాలను అనుమతించవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రహారీ లేదని, నిర్మాణానికి కృషి చేయాలని కలెక్టర్‌కు ఉపాధ్యాయులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుండా పనులెట్లా చేస్తరు..?

● కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ బాధితుల ఆగ్రహం ● పైపులైన్ పనుల అడ్డగింత, పరిస్థితి ఉద్రిక్తం

పైపులైన్ పనులను అడ్డుకుంటున్న గిరిజన రైతులు

కాసిపేట, నవంబర్ 7 : 'మందమర్రి ఏరియా సోమగూడెం శివారులో మాకు తొమ్మిది ఎకరాల భూమి ఉంది. ఇది కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో పోతుంది. ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. అధికారులు జేసీబీలతో మా పంటలపైకి వచ్చి దౌర్జన్యం చేస్తున్నరు. పరిహారం ఇవ్వకుండా పైప్‌లైన్ పనులు ఎట్లా చేస్తరు' అంటూ బానోత్ ఈశ్వరి, కున్సోత్ మోతి, అజ్మీర జమున కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ సమీపంలో చేపడుతున్న పైప్‌లైన్ పనులను వారు అడ్డుకున్నారు. జేసీబీతో పంట కంచెలను తొలగించి పైపులైన్ పనులు చేపడుతుండగా, వారు అడ్డుగా నిలిచారు. దీంతో పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సింగరేణి, రెవెన్యూ అధికారులు పోలీసులతో వచ్చి బెదిరింపులకు పాల్పడుతూ తమ భూములు లాక్కోవాలని కుట్ర చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. బాధిత రైతులకు మాజీ సర్పంచ్ సపాట్ శంకర్, పలువురు నాయకులు మద్దతుగా నిలిచారు. అర్హులైన గిరిజనులకు పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, న్యాయం చేయకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు. పరిహారం విషయంలో గతంలో ఒక గిరిజనుడు ఆత్మహత్య కూడా చేసుకున్నాడని, అయినా అధికారులు కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కాగా, బాధితులు అడ్డుకోవడంతో అధికారులు తిరిగి వెళ్లిపోయారు.

ఓరియంట్ గనికి బహుమతులు

అవార్డులు స్వీకరిస్తున్న ఓరియంట్ సున్నపురాయి గని అధికారులు

కాసిపేట, నవంబర్ 7 : దేవాపూర్‌లో 39వ సున్నపురాయి గనుల భద్రత వారోత్సవాల హైదరాబాద్ రీజియన్ జోనల్ – 2 ముగింపు సభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో మొత్తం 18 గనులు పాల్గొన్నాయి. భద్రత, ఉత్పత్తి రంగంలో ప్రతిభ కనబరిచిన గనులకు బహుమతులు ప్రదానం చేశారు. దేవాపూర్ సున్నపురాయి గని ఓవరాల్ పర్ఫార్మెన్స్‌లో ద్వితీయ బహుమతి, డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టంలో ప్రథమ బహుమతి, సేఫ్ మైన్ వర్కింగ్, లోడింగ్ ట్రాన్స్పోర్టేషన్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్‌లో ద్వితీయ బహుమతి సాధించింది. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ నాగేశ్వరరావు చేతుల మీదుగా సంస్థ యూనిట్ హెడ్, శ్రీ బాల గిరిధర్, జనరల్ మేనేజర్ మైన్స్ రాజశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సహారే, గని అధికారులు బహుమతులు అందుకున్నారు.

మంచిర్యాల డీటీడీవోపై సస్పెన్షన్ వేటు

గంగారాం

మంచిర్యాలటౌన్, నవంబర్ 7 : మంచిర్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (డీటీడీవో) ఎం గంగారాంపై సస్పెన్షన్ వేటు పడింది. విధులను నిర్లక్ష్యం చేసినందుకుగాను ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కుమార్ దీపక్ ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల పట్టణంలోని సాయికుంట గిరిజన ఆశ్రమ పాఠశాలలో 12 మంది విద్యార్థినులు బుధవారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాలేదు. ఈ అంశం రాష్ట్ర అధికార యంత్రాంగానికి తెలిసి వివరణ కోరగా.. వారిని తప్పుదోవ పట్టించేలా సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే అస్వస్థతకు గురైన 12 మంది విద్యార్థినులను ప్రభుత్వ దవాఖానలో చేర్పించి మెరుగైన వైద్యం అందించారు. వారంతా ప్రస్తుతం సురక్షితంగానే ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థినుల అస్వస్థతకు గురైన అంశాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులతో విచారణ జరిపించడం జరుగుతుందన్నారు. పాఠశాలలో వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటుచేసి విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించామని కలెక్టర్ తెలిపారు. విధుల పట్ల డీటీడీవో నిర్లక్ష్యంగా వహించారన్న కారణంగా సస్పెన్షన్ చేస్తున్నట్లు కలెక్టర్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. సస్పెన్షన్‌లో ఉన్నంత కాలం గంగారాం మంచిర్యాల హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని, ఒకవేళ వెళ్లాలంటే జిల్లా ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని, సస్పెన్షన్‌లో ఉన్నంత కాలం ఆయనకు సగం జీతం మాత్రమే వస్తుందని పేర్కొన్నారు.

గ్రంథాలయ సిబ్బంది తో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

పాఠకులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 7 : జిల్లా గ్రంథాలయంలో పాఠకులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయ భవనానికి విద్యుత్, శానిటేషన్ పనులు త్వరగా పూర్తిచేయాలని, సీసీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని, ఆర్‌వో ప్లాంట్ ద్వారా పాఠకులకు శుద్ధ జలాన్ని అందించాలని సూచించారు. ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. గ్రంథాలయంలో పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సదానందం, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : ఎస్పీఎం నీటి కొలనులో ఛట్ పూజలు చేస్తున్న మహిళలు

వైభవంగా ఛట్ పూజలు

నస్పూర్ : గోదావరి నదిలో సూర్య నమస్కారం చేస్తున్న మహిళలు

సీసీసీ నస్పూర్, నవంబర్ 7 : నస్పూర్‌లోని గోదావరి నదిలో గురువారం సాయంత్రం బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు వైభవంగా ఛట్ పూజలు నిర్వహించారు. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో మహిళలు నదిలోకి దిగి సూర్యభగవానుడికి నమస్కారాలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. దీపావళి పండుగ తర్వాత ఛట్ పూజలు చేయడం ఆనవాయితీ. మహిళలు 36 గంటల పాటు నీరు తాగకుండా ఉపవాసం చేసి పూజలు చేస్తారు. ఈ కార్యక్రమంలో జైపూర్ పవర్ ప్లాంట్ క్వాలిటీ మేనేజర్ ఎస్పీ సింగ్, సేఫ్టీ ఆఫీసర్ భరత్‌కుమార్, అమరేందర్‌కుమార్, సంతోష్‌కుమార్, రంజిత్‌కుమార్, మనోజ్‌కుమార్ ఓఝా, అనిల్ పొద్దార్, రాజ్‌కుమార్, సంజీత్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, నవంబర్ 7: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం నీటి కొలనులో గురువారం బిహారీ మహిళలు ఛట్ పూజలు చేశారు. సూర్యభగవానుడికి మొక్కుకున్నారు. అనంతరం ప్రసాదాలతో ఇంటికి వెళ్లారు. శుక్రవారం సూర్యోదయం కంటే ముందే మరోసారి సూర్య భగవానుడికి పూజలు చేస్తారు.